

డెల్టాలకు 9,250 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,250 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 2,750, సెంట్రల్ 1,900, పశ్చిమకు 4,600 క్యూసెక్కులు ఇచ్చారు.



యూడైస్‌తో ఎంతో ప్లస్

పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. - వివరాలు 8లో▸

నిత్యాన్నదానానికి విరాళాలు



సఖినేటిపల్లి: లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి భక్తాంజనేయ స్వీట్స్ అధినేత నలాది వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు (తాపేశ్వరం) రూ.50 వేలు, ఎన్‌కేఎస్‌ఎస్ శ్రీనివాస్, కుటుంబ సభ్యులు (కాకినాడ) రూ.50 వేల చొప్పున సోమవారం విరాళాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

కనకదుర్గమ్మకు మకర తోరణం సమర్పణ



మకర తోరణం సమర్పిస్తున్న దాతలు

సఖినేటిపల్లి: మోరిలో కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారికి స్థానిక వీరా వారి మెరకకు చెందిన వీరా కృష్ణమూర్తి(రిటైర్డ్ లెక్చరర్) కుమారులు సుమారు రూ.6 లక్షల విలువ చేసే వెండి మకర తోరణాన్ని సోమవారం సమర్పించారు. అంతకుముందు ఆలయం వద్ద స్థానిక పూజారి వాడపల్లి శ్రీనివాసాచార్యులు, కృష్ణమూర్తి కుమారులు రెడ్డి నాయుడు, సత్యకృష్ణ, వెంకట్ దంపతులు మకరతోరణానికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దాతలు సమర్పించారు.

మహా రుద్రయాగం పనులకు శ్రీకారం



గణపతి పూజలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి నెలలో 13 రోజుల పాటు నిర్వహించే మహా రుద్రయాగం పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఫిబ్రవరి 12 నుంచి మహా రుద్రయాగాన్ని చంద్రాభట్ల రఘురామశర్మ, వింజమూరి శ్రీరామసుబ్రహ్మణ్యశర్మల ఆధ్వర్యంలో రుద్రయాగ కమిటీ నేతృత్వంలో నిర్వహించనున్నారు. దానిలో భాగంగా వింజమూరి వీరభద్రశర్మ, సీతామహాలక్ష్మి దంపతులతో వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత దూళిపూడి వెంకటేశ్వరరావు, స్థానిక నేతలు గరగ శ్రీనివాసరావు, బైరిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

వెంకన్న హుండీల రాబడి రూ.62.77 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీలను సోమవారం లెక్కించగా రూ.62,77,492 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 31 రోజులకు హుండీలను లెక్కించగా ప్రధాన హుండీల నుంచి రూ. 48,71,170, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.14,06,322 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. బంగారం 37 గ్రాములు, వెండి 331 గ్రాములు వచ్చినట్లు వివరించారు. ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీలను 57 రోజులకు లెక్కించగా రూ.1,56,544 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఈవో ఎన్‌వీఎస్ఎన్ఎస్‌వీ ప్రసాదరాజు, ఆలమూరు గ్రూపు దేవాలయాల ఈవో సీహెచ్ సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించినట్టు చెప్పారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు పోషణ రితిక



ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన సీహెచ్ పోషణ రితిక రాష్ట్ర స్థాయి చెస్ అండర్ 7 విభాగంలో ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. స్థానిక సత్యం పబ్లిక్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఆ బాలిక ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని విశ్వకవి సీబీఎస్ఈ స్కూల్ ఏపీ స్టేట్ చిల్డ్రన్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంది. అందులో ప్రథమ స్థానం సాధించి జిల్లా కలెక్టర్ జీవీ మురళి చేతుల మీదుగా అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ఈ నెల 27న తమిళనాడులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ సోమవారం తెలిపారు.

ఫ్రీడీఎస్ బియ్యంపై హర్షం

- ఆనందం వ్యక్తం చేస్తున్న పేదలు, సామాన్యులు
- ఇప్పటి వరకు 92 శాతం అందజేత
- జిల్లాలో 5.39 లక్షల మందికి లబ్ధి
- ప్రభుత్వంపై ఏటా రూ.10.08 కోట్ల అదనపు భారం



ఎండీయూ ద్వారా రేషన్ పంపిణీ

సాక్షి అమలాపురం: పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సరఫరా చేసే బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జనవరి నెల నుంచి దీనిని అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల మొదటి వారంలో ఆరంభమైంది. బియ్యాన్ని ఉచితంగా అందజేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై పేదలు, సామాన్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్ని ప్రభుత్వం ఇన్నాళ్లు కేజీ ఒక్క రూపాయికి అందజేస్తోంది. ఆ రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 24,804 ఏఏవై కార్డులు ఉండగా, 5,14,321 తెల్లకార్డులు ఉన్నాయి. మొత్తం 5,39,125 కార్డులు ఉండగా, కార్డులోని సభ్యులకు ఐదు కేజీల చొప్పున బియ్యం అందిస్తున్నారు. ఇందుకోసం జిల్లాకు నెలకు తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల నెలకు రూ.90 లక్షల చొప్పున ఏడాదికి రూ.10.80 కోట్ల అదనపు భారం పడుతుంది. ఈ నెల లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇప్పటి వరకు సుమారు 4.95 లక్షల మందికి (92 శాతం) అందజేశారు. రేషన్ ద్వారా ప్రభుత్వం కందిపప్పు కేజీ రూ.67కు, పంచదార అర కేజీ రూ.17 చొప్పున అందిస్తున్న విషయం తెలిసిందే.

జీపీఎస్ ద్వారా పక్కాగా సరఫరా

ప్రభుత్వం ఇప్పటికే రేషన్‌ను వాహనాల ద్వారా అందజేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో 926 రేషన్ షాపుల పరిధిలో 355 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) ద్వారా రేషన్ అందజేస్తోంది. పేదలు, సామాన్యులు రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడకుండా ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ అందజేస్తూ వారి ప్రశంసలందుకుంటోంది. ఎండీయూ ద్వారా మరింత పారదర్శకంగా అందించేందుకు కొన్ని వాహనాలకు జీపీఎస్‌తో అనుసంధానం చేయడం ద్వారా రేషన్ పక్కాగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే.

చాలా సంతోషంగా ఉంది



ఉచిత బియ్యం అందించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రిగా జగన్ వచ్చిన తరువాత ఇంటి వద్దకు రేషన్ అందిస్తున్నారు. మా లాంటి వారికి అది ఎంతో మేలు చేసింది. రేషన్‌కు వెళ్లాలంటే గతంలో రెండు కిలో మీటర్లు దూరం వెళ్లాల్సి వచ్చేది. ఇంటాయన ఉంటే సైకిల్ మీద, లేకుంటే నేను నడిచి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటికే వస్తోంది. ఇప్పుడు బియ్యం ఉచితంగా అందిస్తున్నారు.

– బొంతు నాగమణి, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం.

92 శాతం పంపిణీ పూర్తి



ప్రభుత్వం ఈ నెల నుంచి బియ్యం ఉచితంగా అందించాలని నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే 92 శాతం బియ్యం పంపిణీ పూర్తయ్యింది. మిగిలిన లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.పాపారావు, డీఎస్‌ఓ

నేడు అజయ్ కల్లాం రాక

వైఎస్సార్ జగనన్న భూ హక్కు – భూ రక్షపై ప్రాంతీయ సమావేశం



సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం మంగళవారం రాజమహేంద్రవరం రానున్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఈ విషయం తెలిపారు. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులతో వైఎస్సార్ జగనన్న భూ హక్కు – భూ రక్ష పథకం అమలుపై రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో అజయ్ కల్లాం సమీక్షిస్తారు. భూ హక్కు – భూ రక్ష పథకం స్టీరింగ్, అమలు కమిటీ చైర్మన్ హోదాలో ఆయన ఈ ప్రాంతీయ సమావేశంలో పాల్గొంటారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. అజయ్ కల్లాం పర్యటన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ సోమవారం రాత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు.

దేవదాయ మంత్రికి ఆహ్వాన పత్రిక



మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ నిర్వహించనున్న లక్ష్మీనృసింహుని వార్షిక కల్యాణ మహోత్సవాలపై ఆహ్వాన పత్రికను సోమవారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. ఈ మేరకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలుసుకుని ఆహ్వాన పత్రికను ఇచ్చారు.

అర్జీల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శుక్లా



స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అర్జీదారులు

- కలెక్టర్ శుక్లా
- స్పందనలో 197 వినతులు

సాక్షి అమలాపురం: అర్జీల సత్వర పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో 197 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. సంక్షేమ పథకాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, పేదలకు ఇళ్ల మంజూరు, రెవెన్యూ సేవలు, సర్వే, సామాజిక భద్రత పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై అర్జీలు అందాయి. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి సచివాలయాల ద్వారా శాఖల వారీగా సమస్యలు పరిష్కరించాలన్నారు. అమలాపురం మండలం ఇందుపల్లికి చెందిన మత్స్యకారులు చేపల వేట చేయకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. కొత్తపేట మండలం అవిడి గ్రామానికి చెందిన బూడిగ నాగభూషణం అనే దివ్యాంగుడు స్పందనలో అందించిన అర్జీపై వెంటనే స్పందించిన కలెక్టర్ ట్రై సైకిల్‌ను అందజేశారు. జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 24 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి 24 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందరు కుటుంబ సమేతంగా వచ్చి ఎస్పీకి వినతి పత్రాలు అందించి తమ సమస్యలు చెప్పుకున్నారు. వచ్చిన 24 అర్జీల్లో కుటుంబ తగాదాలు, భూ వివాదాల సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. కొన్ని అర్జీలను ఎస్పీ అక్కడికక్కడకు పరిష్కరించి ఆయా పోలీస్‌స్టేషన్లకు ఆదేశాలిచ్చారు. ఎస్పీ కార్యాలయ స్పందన పర్యవేక్షణ ఎస్‌ఐ సీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

గడువులోగా జగనన్న సర్వే



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో సత్తిబాబు

కలెక్టర్ శుక్లా ఆదేశం

సాక్షి అమలాపురం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు –భూ రక్ష రీ సర్వే గ్రామాల్లో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో సమీక్ష జరిపారు. మంగళవారం భూసర్వేకి సంబంధించి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమావేశం రాజమహేంద్రవరం కేంద్రంగా నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లాల వారీగా సర్వేలో పురోగతిపై క్షుణ్ణంగా సమీక్షించనున్నారని తెలిపారు. జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ జిల్లాలో సర్వే చేపట్టిన అన్ని గ్రామాలలో దశలవారీగా అన్ని ప్రక్రియలు పూర్తిచేసి భూ హక్కు పత్రాలు, భూ యజమాని పేరిట పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ గోపాలకృష్ణ, సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి పాల్గొన్నారు.

27న హుండీల లెక్కింపు

సఖినేటిపల్లి: ఈ నెల 27న లక్ష్మీనృసింహుని హుండీల లెక్కింపు చేపట్టనున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ అధికారుల సమక్షంలో ఈ లెక్కింపు చేపడతామన్నారు.

ఆర్‌అండ్‌డీ సెల్ ఇన్‌చార్జి డీన్‌గా రమణేశ్వరి



రమణేశ్వరికి ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రసాదరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి డీన్‌గా ఆచార్య కె.రమణేశ్వరిని నియమిస్తూ ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమెకు ఉత్తర్వులు అందజేశారు. వర్సిటీ పరిధిలో పరిశోధనలు పెరగాలని ఈ సందర్భంగా ఆయనన్నారు. పరిశోధనలు, ఫెలోషిప్ వంటి అంశాలు ఈ సెల్ పరిధిలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్‌లు ఆచార్య పి.సురేష్‌వర్మ, డాక్టర్ ఎ.మట్టారెడ్డి, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.1000 సహాయ పథకం ప్రారంభం

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలోని దారిద్య్రరేఖకు దిగువనున్న కుటుంబాల్లోని మహిళా యజమానికి ప్రతినెలా రూ.1000 సహాయాన్ని అందించే పథకాన్ని సోమవారం ఎల్జీ తమిళిసై సౌందరాజన్, సీఎం రంగసామి ప్రారంభించారు. బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించినట్లు ఈ పథకాన్ని తొలి విడతగా 17 వేల మందికి అమలు చేయనున్నారు. అర్హులైనవారు సుమారు 50 వేల మంది ఉన్నారన్నారు. ఈ పథకానికి ఏటా ప్రభుత్వం రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబంలోని మహిళా యజమానికి అందించే రూ.1000 సహాయ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు.

వేద పండితుడు తంగిరాల విశ్వనాథశాస్త్రి కన్నుమూత



తంగిరాల విశ్వనాథశాస్త్రి (పాతచిత్రం)

రాజమహేంద్రవరం రూరల్: తంగిరాల వారి వంశంలో రెండో తరం ద్వివేదిగా, శ్రీశైలం దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా 40 ఏళ్లు సేవలందించిన వేద పండితుడు తంగిరాల విశ్వనాథశాస్త్రి (100) కొంతమూరులోని ఆయన కుమారుని నివాసంలో కన్ను మూశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రముఖ త్రివేది తంగిరాల బాలగంగాధరశాస్త్రి పెద్ద కుమారుడైన విశ్వనాథశాస్త్రి సోమయాగం, మహాగ్నిచైనం, వ్యూఢ పౌండరీకం, బృహస్పతీ సవం, వాజపేయం తదితర ఉత్కృష్ట యాగాలు నిర్వహించారు. పౌండరీక, వాజపేయ, సోమయాజులుగా పేరు పొందారు. ఆయనకు ముగ్గురు కుమారులు. వారందరూ కూడా ద్వివేదులే. ఆయన ఐదుగురు మనవలు కూడా వేద విద్య అభ్యసిస్తున్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆహితాగ్ని భాస్కర బిరుదును, స్వర్ణ కంకణాన్ని విశ్వనాథశాస్త్రి అందుకున్నారు. వేలాది మంది శిష్యుల్ని తయారు చేసిన ఘనత ఆయనకు ఉంది. శ్రీశైలం దేవస్థాన ఆస్థాన విద్వాంసుడిగా పదవీ విరమణ అనంతరం కపిలేశ్వరపురం వేద పాఠశాలలో ఉపాధ్యాయునిగా సేవలు అందిస్తున్నారు. కొద్ది రోజులుగా అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. విశ్వనాథశాస్త్రి పార్థివ దేహాన్ని జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరుమాళ్ళ రఘునాథ్, వందలాదిగా వేద పండితులు సందర్శించారు.

గోరుముద్ద మరింత ప్రేమగా..

- మెనూలో మార్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నూతన మెనూ పక్కాగా అమలుకు చర్యలు
- జిల్లాలో 1.18 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం



మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం (జగనన్న గోరుముద్ద)ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నారు. పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించడం ద్వారా డ్రాపౌట్లను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద'ను చిత్తశుద్ధితో అమలు చేస్తోంది. నాణ్యతలోనూ రాజీ పడకుండా విద్యార్థులకు కడుపునిండా కమ్మని భోజనం పెడుతోంది. కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఇబ్బందులు కలగకుండా వారికి ఇచ్చే నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం పెంచింది. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా తీసుకునేందుకు మెనూలో తరచుగా మార్పులు చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు మెనూను మార్పు చేసిన ప్రభుత్వం ప్రస్తుతం అమలవుతున్న మెనూలో స్వల్ప మార్పులు చేసింది. ఇప్పటికే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు, చిక్కీని అదనంగా అందిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 22 మండలాల్లో 1,581 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ప్రభుత్వ, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,18,798 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తీసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోంది.

రోజుకొక మెనూ..

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రోజుకొక మెనూను అమలు చేయడంతో పాటు సోమవారం నుంచి శుక్రవారం ప్రతి రోజూ ఉడికించిన గుడ్డు, రోజు విడిచి రోజు చిక్కీని అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిగా అందించడమే కాకుండా పరిశుభ్రమైన వాతావరణంలో అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు పాఠశాల హెచ్ఎంలు, ఎంఈవోలతో పాటుగా సచివాలయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇటీవల నూతనంగా నియమితులైన వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు గోరుముద్ద అమలును ప్రత్యక్ష్యంగా పరిశీలిస్తున్నారు. విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం మెనూలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది. మధ్యాహ్న భోజన పథకంలో సరకుల నాణ్యత పెంచేందుకు నిర్వహణ నిధులను ప్రభుత్వం పెంచింది. గతంలో ప్రాథమిక స్థాయి విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.4.97 చెల్లించగా, ప్రస్తుతం ఆ ధరను రూ.5.88కు పెంచారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గతంలో రూ.7.45 చెల్లించగా, ఇప్పుడు దానిని రూ.8.57 పెంచారు. దీంతో మరింత నాణ్యతతో మధ్యాహ్న భోజనం అందించే అవకాశం ఏర్పడింది.

పర్యవేక్షణ పెంచాం



పాఠశాల విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో ప్రభుత్వం రుచికరమైన ఆహార పదార్థాలను అందజేస్తోంది. పథకంపై పర్యవేక్షణ పెంచాం. తాగునీటి కోసం పాఠశాలల్లో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేశాం. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం.

- ఎస్‌వీ రవిసాగర్, డీఈవో, అమలాపురం

నూతన మెనూ ప్రకారం



పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో నూతన మెనూను అమలు చేస్తున్నాం. గతంలో అమలు చేస్తున్న మెనూ స్థానంలో కొన్ని మార్పులను ప్రభుత్వం సూచించింది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. హెచ్ఎంలు కచ్చితంగా నూతన మెనూను అమలు చేయాలి.

- నక్కా సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్, జగనన్న గోరుముద్ద, అమలాపురం

యూడైస్‌తో ఎంతో ప్లస్

- పాఠశాల స్థాయి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్న విద్యాశాఖ
- దీని ఆధారంగానే 2023–24 సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పన
- అందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల మంజూరు
- ఈ నెల 26 ఆన్‌లైన్ నమోదుకు తుది గడువు





రాయవరం: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలకు ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల కేటాయింపు జరుగుతుంటుంది. ప్రణాళిక రూపకల్పనలో భాగంగా యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. వచ్చిన సమాచారం ఆధారంగానే జిల్లా సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పనకు వీలవుతుంది.

సెప్టెంబర్ 30వ తేదీ ప్రాతిపదిక

సమగ్ర జిల్లా విద్యా సమాచార వ్యవస్థను యూడైస్‌గా పేర్కొంటారు. 2022–23 విద్యా సంవత్సరం పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సదుపాయాల వివరాలను యూడైస్ ద్వారా సేకరిస్తారు. కేంద్ర ప్రభుత్వం యూడైస్ ద్వారా పాఠశాలల సమాచార సేకరణను 2000 సంవత్సరం నుంచి ప్రారంభించింది. ఏటా సెప్టెంబర్ 30 తేదీని ప్రాతిపదికగా తీసుకుని యూడైస్ ద్వారా పాఠశాలల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ ఏడాది కూడా పాఠశాలల సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు విద్యాశాఖ, ఏపీ సమగ్ర శిక్షా సంయుక్తంగా కసరత్తు ప్రారంభించాయి.

తుది రూపునకు విద్యా ప్రణాళిక..

సాధారణంగా ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక అవసరాలకు నిధుల కేటాయిస్తారు. పాఠశాలల నుంచి వచ్చే సమాచారమే నిధుల కేటాయింపునకు ప్రాతిపదికగా నిలుస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 5,261 విద్యా సంస్థల నుంచి సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కావాలన్నా, ఉన్న పోస్టులను రేషనలైజేషన్ చేయాలన్నా, నూతనంగా అదనపు తరగతి గదులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ర్యాంపులు, వంటగదులు, లేబొరేటరీ గదులు, ప్రత్యేక అవసరాల గల చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు.. ఇలా ఏది మంజూరు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ ద్వారా పంపే సమాచారాన్నే ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ సమాచారం ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీ సమగ్ర శిక్షాకు నిధులు కేటాయిస్తాయి. అందుకే యూడైస్ ప్లస్ ద్వారా సేకరించే సమాచారం కీలకంగా మారుతుంది.

ఈ వివరాల ద్వారానే సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌ను సాధించడం సాధ్యపడుతుంది. ఎస్‌డీజీ, పీజీఏ, నీతి ఆయోగ్‌కు సంబంధించిన అన్ని విషయాలకు యూడైస్ ప్రాతిపదికగా నిలుస్తోంది. ఈ డేటా ఆధారంగా విద్యాశాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాల నిర్వహణ, 2023–24 విద్యా సంవత్సరానికి సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పన వీలవుతుంది.

ఈ నెల 26 తుది గడువు

గతంలో యూ డైస్ ప్లస్ సమాచార సేకరణ మాన్యువల్‌గా ఉండేది. మూడేళ్లుగా ఆన్‌లైన్‌లోనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. పాఠశాల కేంద్రంగా సమాచారాన్ని హెచ్‌ఎంలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ సమాచారం నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతుంది. ఈ నెల 26వ తేదీలోగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు యూడైస్ రూపకల్పనలో బిజీగా ఉన్నారు. ఈ నెలాఖరులో జిల్లా బడ్జెట్ రూపకల్పనకు తుది రూపు వచ్చే అవకాశం ఉంది.

సమాచారం కీలకం



విద్యాశాఖకు సంబంధించిన బడ్జెట్ రూపకల్పనకు యూడైస్ ప్లస్ సమాచారం ఎంతో కీలకం. పాఠశాల హెచ్‌ఎంలు క్షేత్ర స్థాయిలో ఉన్న కచ్చితమైన సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ సమాచారం పాఠశాలల అభివృద్ధికి కీలకంగా ఉంటుంది.

– డి.మధుసూదనరావు, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

గడువులోగా పూర్తి చేయాలి



యూడైస్ సమాచార సేకరణను హెచ్‌ఎంల సహకారంతో అనుకున్న సమయానికి పూర్తి చేస్తాం. ఉపాధ్యాయులు ఇచ్చే సమాచారం ఆధారంగానే పాఠశాలలకు నిధుల కేటాయింపు ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది.

– ఎస్.అబ్రహం, డీఈవో, తూర్పుగోదావరి

ఆ వివరాలు తప్పనిసరి



యూ డైస్ ప్లస్ నమోదు సమయంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. పాఠశాల సమగ్ర సమాచారం యూడైస్ ప్లస్‌లో స్పష్టంగా కనిపించాలి. ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా సమాచార సేకరణ చేపట్టాలి.

– ఎస్‌వీ రవిసాగర్, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- బీటెక్ విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన తరుణ్ బాబు



తరుణ్‌బాబు (ఫైల్)

మాకవరపాలెం : బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన లంకె తరుణ్ బాబు, సింగిరెడ్డి దినేష్(విజయనగరం), రావాడ లోకేష్ (శ్రీకాకుళం)లు మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. వీరంతా కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే ఆదివారం రాత్రి మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లిన వీరు తిరిగి వస్తుండగా రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో తరుణ్‌బాబు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా, లోకేష్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న దినేష్‌ను విశాఖ తరలించారు. ఈ సంఘటనలో బైక్ నుజ్జునుజ్జయింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే హాస్టల్‌కు చేరుకోనున్న తరుణ్‌బాబు మృతి చెందడంతో తోటి విద్యార్థులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సర్వీసు అందించాలి



షోరూమ్ ప్రారంభోత్సవంలో జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, షోరూమ్ చైర్మన్ రమేష్ తదితరులు



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

- పృధ్వీ టయోటా షోరూమ్ ప్రారంభోత్సవంలో ఎంపీ గీత, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి

కాకినాడ రూరల్: ఖాతాదారులకు మెరుగైన సర్వీసును అందివ్వాలని ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. కాకినాడ – పిఠాపురం రోడ్డులో రాయుడుపాలెం జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పృధ్వీ టయోటా షోరూమ్‌ను సోమవారం వారు ప్రారంభించారు. షోరూమ్ చైర్మన్ మాలెంపాటి రమేష్‌బాబు, డైరెక్టర్ పృధ్వీలకు అభినందనలు తెలియజేశారు. చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ కాకినాడ ప్రాంతంలో టయోటా వాహనాలకు సర్వీసు సదుపాయం కొన్నేళ్లుగా నిలిచిపోయిందని, ఇప్పుడు కొత్తగా పృధ్వీ టయోటా షోరూమ్ ద్వారా ఆ లోటు తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. షోరూమ్ ద్వారా కస్టమర్లకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ప్రారంభం సందర్భంగా 100శాతం ఫైనాన్స్ సౌకర్యంతో వాహనాలను కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో షోరూమ్ ప్రారంభించి ఉభయ గోదావరి జిల్లాల కస్టమర్ల మన్ననలు పొందామన్నారు.

రాయుడుపాలెం వద్ద షోరూమ్ ప్రారంభోత్సవంలో కలెక్టరు కృతికా శుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, పిఠాపురం, పెద్దాపురం ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, నిమ్మకాయల చినరాజప్ప, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, సేల్స్ మేనేజర్ శివ, సర్వీసు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి కారును బి.శ్రీనివాస్, రెండవ కారును టి.వెంకటరత్నం కొనుగోలు చేశారు.

సైకత ప్రశ్న



దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకత శిల్పం

రంగంపేట: తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలో దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకత శిల్పం పలువురిని ఆలోచింపజేస్తోంది. ఈ నెల 24న జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) ఆడపిల్లగా పుట్టడమే పాపమా..? అనే నినాదంతో సోమవారం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పాన్ని తీర్చిదిద్దిన దేవిన సిస్టర్స్‌ను పలువురు అభినందిస్తున్నారు.

హోంగార్డు దుర్మరణం



హోంగార్డు గోవిందు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని మాలపాడుకు చెందిన హోంగార్డు మేడిశెట్టి గోవిందు(33) సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు రామచంద్రపురం ఎస్సై డి.సురేష్‌బాబు విలేకరులకు తెలిపారు. హోంగార్డు గోవిందు మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రం అమలాపురానికి రిపబ్లిక్ పరేడ్ నిమిత్తం వెళ్లాడు. ఆదివారం జరిగిన పోలీస్ సెలెక్షన్ పరీక్షలకు పరేడ్ ఇన్‌చార్జి అనుమతి తీసుకుని వచ్చాడు. సోమవారం తెల్లవారు జామున తిరిగి పరేడ్‌కు వెళ్తున్నట్లు ఇంటిలో తెలియజేసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అయితే మాలపాడు–కొత్తూరు మధ్య గల కోళ్ళ ఫారం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పెద్ద శబ్దం అయ్యేసరికి సమీపంలోని పొలంలో పనిచేస్తున్న ఇంత చంటి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలియజేయగా, వారు వచ్చి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్ష చేసి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీనితో ఆసుపత్రి సమాచారం, సోదరుడు మేడిశెట్టి సత్యానందం ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

గ్రామంలో విషాద ఛాయలు..

అందరితో కలివిడిగా ఉండే హోంగార్డు గోవిందు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గోవిందుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉద్యోగంలో ఉన్నతి కోసం పరీక్ష రాయడానికి వచ్చి తిరిగిరాని లోకాలకు తరలిపోయిన గోవిందు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

వల్లీ సిల్క్స్‌లో పట్టు చీరల విభాగం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: కోటగుమ్మం సెంటర్‌లోని వల్లీ సిల్క్స్ షోరూంలో పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా సోమవారం పట్టు చీరల విభాగం ప్రారంభమైంది. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సీజన్‌లో అనేక ఆఫర్లతో కొత్త కలెక్షన్లు అందిస్తున్న వల్లి సిల్క్స్ షోరూంలో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామిజీ చేతుల మీదుగా నూతన పట్టు విభాగం ప్రారంభించామని వల్లి సిల్క్స్ డైరెక్టర్ సుభాష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టు చీరల విభాగంలో పెళ్లిళ్లకు, పండగలకు, అన్ని శుభకార్యాలకు కావాల్సిన పట్టు వెరైటీలు లభిస్తాయన్నారు. లక్షకు పైగా చీరలు, 6,000 పైగా వెరైటీలు, రూ.250 నుంచి రూ. 2 లక్షలకు వరకు వస్త్ర శ్రేణి లభిస్తుందన్నారు. మహిళలు కోరుకునే కంచి పట్టు చీరలు, బనారస్, ఇక్కత్, కలంకారీ, ఆర్గాంజా, లైట్ వెయిట్ పట్టు, గద్వాల్, జార్జెట్, బనారస్, బాంధిని, డిజైనర్ వర్క్ శారీస్, పట్టు ఇక్కత్ పావడాస్ లాంటి ఎన్నో వెరైటీలు లభిస్తాయన్నారు. పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని డైరెక్టర్ సుభాష్ తెలిపారు.

పట్టాలు తప్పిన గూడ్స్



సామర్లకోట – పిఠాపురం బైపాస్ లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్

సామర్లకోట: కాకినాడ నుంచి విశాఖపట్నానికి ఎరువుల లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు సోమవారం పట్టాలు తప్పింది. సామర్లకోట సమీపంలోని ఉండూరు రైల్వే గేటు మీదుగా బైపాస్ లైన్ నుంచి విశాఖ వెళ్లే ప్రధాన లైనులోకి మారుతున్న సమయంలో ఇంజిన్ నుంచి 21వ వ్యాగన్ పట్టాలు తప్పింది. సామర్లకోట – పిఠాపురం రైల్వే లైను కేఎం నంబరు 630/18–22 మధ్య ఈ ప్రమాదం జరిగినట్టు రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 100 మీటర్లు వెళ్లిన తరువాత వాక్యూమ్ బయటకు రావడంతో గూడ్స్ డ్రైవర్ అప్రమత్తమై, రైలును నిలిపివేశారు. ఈ ప్రమాదంతో 100 మీటర్ల మేరకు స్లీపర్లు పాడైపోయాయి. ఏలేరు కాలువ తూము వద్ద రైలు ఒత్తిడికి పట్టా విరిగిపోయింది. విశాఖపట్నం – విజయవాడ మధ్య పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. విజయవాడ వెళ్లే యశ్వంత్‌పూర్, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లను పిఠాపురంలో నిలిపివేశారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీకాంత్ ఆధ్వర్యాన ఏడీఎంఎ ఇ.శామ్యూల్ కుమార్, ఏడీఈఎన్ శివప్రసాద్, ఏడీఈఈ సీహెచ్ శ్రీహరివర్మ, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, పబ్లిక్ వే ఇన్‌స్పెక్టర్లు రామసుబ్బారావు, సాయి శంకర్, సామర్లకోట, పిఠాపురం, తుని, కాకినాడ ప్రాంతాలకు చెందిన గ్యాంగ్‌మన్లు అక్కడకు చేరుకున్నారు. రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక క్రేన్‌ను తీసుకు వచ్చి పట్టాలు తప్పిన వ్యాగన్‌ను సరి చేశారు. సామర్లకోట – పిఠాపురం బైపాస్ లైను దెబ్బ తినడంతో ఆ ట్రాక్ మీదుగా రైళ్ల రాకపోకలను నిలిపి వేశారు. కాకినాడ – విశాఖపట్నం మధ్య నడిచే గూడ్స్ రైళ్లను సామర్లకోట స్టేషన్ మీదుగా మళ్లించారు.

కట్నం వేధింపులపై భర్తతో సహా నలుగురిపై కేసు

పి.గన్నవరం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తతో సహా నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.గంగాభవాని తెలిపారు. ముంగండ గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జునకు 2012లో శ్రీదేవితో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షలు, బంగారు నగలు కట్నంగా ఇచ్చారని, 2017లో వారికి కుమారుడు జన్మించాడని ఆమె వివరించారు.

అప్పటి నుంచి మరో రూ.2 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని శ్రీదేవిని వేధిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దల సమక్షంలో చర్చలు జరిగినా వేధింపులు ఆగలేదన్నారు. అదనపు కట్నం తేలేదని ఈ నెల 19న కుమారుడితో సహా శ్రీదేవిని ఇంటి నుంచి బయటకు గెంటివేశారని తెలిపారు. బాధితురాలు శ్రీదేవి ఫిర్యాదు మేరకు భర్త నాగార్జున, అత్తమామలు సత్యవతి, శ్రీనివాస్, బావ ఉపేంద్రలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ గంగాభవాని వివరించారు.

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

ముమ్మిడివరం: మద్యం మత్తులో ఒక వ్యక్తి కలుపు మందు తాగి మృతి చెందాడు. ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతానికి చెందిన చప్పిడి వీరబాబు(42) తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో మకాం ఉంటున్నాడు. ఆదివారం ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చి తన ఆర్థిక పరిస్థితి బాగో లేదని, ఆదుకోవాలని వారితో చెప్పుకున్నాడు. అనంతరం అతిగా మద్యం తాగాడు. ఆ మైకంలో అతను కలుపుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతనిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.